క్లుప్తంగా

వేదాద్రిలో వైభవంగా హనుమత్ సేవ



వేదాద్రి(జగ్గయ్యపేట):ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి తిరుక్కళ్యాణ మహోత్సవాలలో భాగంగా బుధవారం స్వామి వారికి హనుమత్ సేవ అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యులు, వేదాంతం శేషాచార్యులు, శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హనుమత్ వాహనంపై స్వామి వారిని ఉంచి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. ఈవో నాగరాజు, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, సర్పంచ్ గుడారు పేరయ్య, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా వరంగల్‌కు చెందిన జానపద కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మురుగుపారుదలకు చర్యలు

కంచికచర్ల: మండల కేంద్రంతోపాటు గండేపల్లి, కీసర, వేములపల్లి, పరిటాల గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం శానిటేషన్ పనులు చేపట్టారు. కంచికచర్ల సర్పంచ్ వేల్పుల సునీత మాట్లాడుతూ, పట్టణంలోని 1వ వార్డులో రోడ్డు పక్కన చెత్తాచెదారం ఉందని వాటిని తొలగించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. డ్రెయినేజీల్లో మురుగునీరు పారుదల కోసం తగు చర్యలు తీసుకున్నామన్నారు. రోడ్డు పక్కన ముళ్ల పొదలు దట్టంగా పెరిగాయని వాటిని పొక్లెయిన్ ద్వారా తొలగించే పనులు చేపట్టామన్నారు. మండలంలోని పరిటాల, గండేపల్లి గ్రామాల్లో కూడా శానిటేషన్ పనులు చేపట్టామని సర్పంచులు యద్దనపూడి ఆనంద జ్యోత్స్న, బొక్కా రవికుమార్‌లు తెలిపారు. వేసవికాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా నిత్యం సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షేక్ మీర్జా వలి, జిల్లేపల్లి రత్నాకర్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నియమాలు పాటించాలి

జగ్గయ్యపేట అర్బన్:పట్టణంలో జంతు మాంసం విక్రయదారులు ఆహార భద్రతా నియమ నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో జంతు మాంస విక్రయాలపై పలు ఫిర్యాదులు వస్తున్నందున శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది, వెటర్నరీ అధికారులతో వెళ్లి జంతు మాంస విక్రయషాపులు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విక్రయదారులు అనారోగ్యంతో, గర్భిణితో ఉన్న పశువులు, 6 నెలల లోపు వయస్సు ఉన్న పిల్లలను వధించరాదని, పాడైపోయిన, నిల్వ ఉన్న మాంసాన్ని రెస్టారెంట్ల వారు, విక్రయదారులు అమ్మరాదని తెలిపారు. అలా అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రహరీ నిర్మాణ పనులకు భూమి పూజ

నందిగామ: ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అండగా నిలుస్తోందని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండల పరిధిలోని మాగల్లు గ్రామంలో ముస్లిం బరియల్ గ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. రూ. 10 లక్షల పంచాయతీ నిధులతో ఈ ప్రహరీ నిర్మించనున్నారు. భూమి పూజ పనులను రవిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా బ్యాంక్ పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగా మైనారిటీలకు సహాయ సహకారాలందిస్తోందన్నారు. పార్టీ మండల ఏటిపట్టు గ్రామాల కన్వీనర్ దేవినేని రామారావు, గ్రామ సర్పంచ్ గుంటి ఆశాజ్యోతి, పలువురు ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నిరసన

నందిగామ: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు నేపథ్యంలో బుధవారం స్థానిక నాయకులు గాంధీ సెంటర్ లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయవద్దంటూ నినాదాలు చేశారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు చనుమోలు సైదులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర పార్టీ జాతీయ రహదారులపై రాస్తారోకోకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పలువురు సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తు హౌస్ అరెస్టు చేశారు.

ఈకేవైసీ తప్పనిసరి

నందిగామ:పీఎం కిసాన్ సొమ్ము పొందటానికి రైతులు వెంటనే ఈ కేవైసీ ధ్రువీకరించుకోవాలని నందిగామ సహాయ వ్యవసాయ సంచాలకులు ధర్మపురి రమణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరు లేదంటే జూన్ మొదటి వారంలో కేంద్ర ప్రభుత్వం రైతుల ఖాతాలకు పీఎం కిసాన్ సొమ్ము జమ కానుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 15 వ తేదీ లోగా రైతులు ఈ కేవైసీ చేసుకోవాలన్నారు. నందిగామ నియోజకవర్గ పరిధిలో 32,600 మంది రైతులకు గాను ఇప్పటివరకు 27,452 మంది చేసుకున్నారని తెలిపారు.

సొంతింటి కల సాకారం దిశగా..

- గృహ లబ్ధిదారులకు అదనపు ప్రయోజనం
- స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.35 వేల రుణం



నవాబుపేటలో ఇళ్ల నిర్మాణాలు

పెనుగంచిప్రోలు:పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. దేశ చరిత్రలోనే తొలిసారిగా లక్షలాదిమందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి వైఎస్సార్ జగనన్న కాలనీలుగాలే అవుట్లను తీర్చి దిద్దింది. అక్కడితో ఆగకుండా ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన వసరులు సమకూరుస్తోంది. లబ్ధిదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవటంతో ఇంకా నిర్మాణ పనులు ప్రారంభించని నిర్మాణదారులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తూ సాయం చేస్తోంది. వివిధ దశల్లో నిర్మాణాలు పూర్తి చేసిన వారికి సకాలంలో బిల్లులు కూడా చెల్లిస్తోంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రూ.35 వేలు సాయం అదనంగా అందిస్తోంది.

నిర్మాణాలు పూర్తి చేయటమే లక్ష్యంగా...

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయటమే లక్ష్యంగా డ్వాక్రా సంఘ సభ్యులైన లబ్ధిదారులకు రూ.35 వేలు రుణాలు అందిస్తున్నారు. బ్యాంకులు ఇచ్చే రుణాన్ని సులభ వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు కల్పించారు. ప్రస్తుత ప్రభుత్వం ఒకొక్క ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందిస్తోంది. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి మెటీరియల్ సమకూర్చుకుంటే రూ.15 వేలు, బేస్‌మెంట్ పూర్తి చేస్తే మెటీరియల్ బిల్లును అందించటంతో పాటు ప్రోత్సాహకంగా రూ.10 వేలు ఇస్తారు. గతంలో పునాది పూర్తి చేస్తేనే రూ.70 వేలు అందించేవారు. ఇప్పుడు ముందుగా నిధులు అందిస్తుండటంతో నిర్మాణదారులకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. రాయితీపై మెటీరియల్‌తో పాటు గృహ నిర్మాణం పూర్తి చేసేందుకు 90 బస్తాల సిమెంట్‌ను అందిస్తున్నారు. ఈసొమ్ములోనే అర టన్ను ఇరన్ ఇస్తున్నారు. అదనంగా 20 టన్నుల ఇసుకను ఉచితంగా ఇస్తున్నారు.

నియోజకవర్గంలో డ్వాక్రా సంఘాల మహిళలకు అదనపు సాయం...

మండలం	ఇళ్లు మంజూరైన వారు	రుణంతీసుకున్న వారు	తీసుకోవాల్సిన వారు
జగ్గయ్యపేట	1183	1140	43
పెనుగంచిప్రోలు	1050	1026	24
వత్సవాయి	1539	1489	50

అదనపు సాయంతో ఇళ్లను పూర్తి చేశాం



జగనన్న గృహ లబ్ధిదారులకు హౌసింగ్ నుంచి వచ్చే బిల్లులతో పాటు బ్యాంక్‌ల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు అదనంగా రూ.35 వేలు ఇచ్చారు. హౌసింగ్ బిల్లులు సకాలంలో బ్యాంక్‌లో వేశారు. ముఖ్యమంత్రి జగనన్న వల్ల నా సొంతింటి కల సాకారమైంది.

–శివలీల, లబ్ధిదారులు

వేగంగా ఇళ్ల నిర్మాణాలు



మండలంలో 1050 మందికి ఇళ్లు మంజూరు కాగా రూ.35 వేల చొప్పున 1026 మందికి రుణం అందించాం. మరో 24 మందికి కూడా అందించి నూరుశాతం పూర్తి చేస్తాం. అదనపు లబ్ధితో నిర్మాణాలు వేగంగా చేస్తున్నారు.

– కాకాని పద్మ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, పెనుగంచిప్రోలు

మజ్జిగ పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్:పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఏర్పాటుచేసిన ఆయుర్వేద మజ్జిగ పంపిణీ కార్యక్రమం బుధవారం 10 వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి మాట్లాడుతూ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సుమారు 2 వేల మందికి సంఘ పెద్దలు పంపిణీ చేసినట్లు తెలిపారు. సంఘ కోశాధికారి చెరుపల్లి నాగరాజు, సంఘ ప్రముఖులు మెటికల శ్రీనివాసరావు, యాపిల్ ల్యాబ్ శ్రీనివాసరావు, సంగెపు రాజశేఖర్, పొట్టాబత్తిన ర ఘునాథ్, రచ్చా శ్రీనివాసరావు, బొట్లా వీరభద్రం, సంగెపు నాగేశ్వరరావు, తారక వినయ్, మోతుకూరి సాయి, తుమ్మా ధనుంజయ్, పొట్టాబత్తిన నాగేశ్వరరావు, రాంకిరణ్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు బాలసైదా అంబులెన్స్ సేవలు



అంబులెన్స్‌లో బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

జగ్గయ్యపేట అర్బన్:పట్టణంలో భవన నిర్మాణ కార్మికులు, ఇతర అసంఘటిత తరంగ కార్మికుల సౌకర్యం కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి షేక్ బాలసైదా సేవాసమితి పేరుతో రెండు అంబులెన్స్ వాహనాల ద్వారా సేవలందిస్తున్న అగ్రహారం గ్రామానికి చెందిన డ్రిల్లింగ్ ఖాజా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తన సేవలను అందించారు. జాతీయ రహదారిపై చిల్లకల్లు గ్రామంలోని భారత పెట్రోల్ బంక్ వద్ద ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటనకు సంబంధించి తెల్లవారుజామునే చిల్లకల్లు పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకున్న డ్రిల్లింగ్ ఖాజా హుటాహుటిన సంఘటన స్థలానికి తన సిబ్బందితో వెళ్లి తన అంబులెన్స్ వాహనాల ద్వారా బాధితులను పేట ప్రభుత్వాస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను స్ఫూర్తితో తాను ఈ సేవలను అందిస్తున్నట్లు ఖాజా తెలిపారు. పేట ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్

జగ్గయ్యపేట అర్బన్:వర్షాలు కురుస్తుండటం వలన వార్డుల్లో పారిశుద్ధ్య పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. బుధవారం పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మండు వేసవి అయినప్పటికీ వర్షాలు కురుస్తున్నందు ప్రజలు తమ పరిసరాలు, కాలువల్లో చెత్త, వ్యర్థాలను పడవేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మున్సిపాలిటీ వారి చెత్త వాహనాలలో చెత్త పడవేయాలని సూచించారు. గృహాల చెంతనే చెత్త, వ్యర్థాలు కుప్పలుగా పడవేయడం వలన ఈగలు, దోమలు, పందులు చేరి పరిసర ప్రాంతం అంతా అధ్వానంగా తయారవుతుందని పేర్కొన్నారు. ఫలితంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తంగా ఉంటూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

విశ్వకర్మ లెజండరీ అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్, వెంకట్ విశ్వకర్మ

భవానీపురం(విజయవాడపశ్చిమ): అనాదిగా దేశ సంస్కృతికి మూలస్తంభాలుగా నిలిచింది విశ్వకర్మలేనని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న 'విశ్వకర్మ లెజండరీ అవార్డ్స్' 2023, విశ్వకర్మ నేషనల్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన బుధవారం గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గల తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి..

ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆధునిక యుగంలో దేశవ్యాప్తంగా సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్న విశ్వకర్మలను గుర్తించి వారిని సన్మాన పూర్వకంగా గౌరవించుకోవడం హర్షణీయమన్నారు. ప్రతి ఏడాది వివిధ రాష్ట్రాల్లో జరిగే విశ్వకర్మ లెజండరీ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఈ ఏడాది విజయవాడలో నిర్వహిస్తున్నందున రాష్ట్రం నలుమూలల నుంచి విశ్వకర్మలు తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకట్ విశ్వకర్మ మాట్లాడుతూ విశ్వకర్మ సంస్కృతి, సంక్షేమం, అభివృద్ధి తదితర రంగాల్లో విశేషమైన కృషి చేసిన విశ్వకర్మలకు ఈ పురస్కారాలను అందచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకం, రుంజు వాయిద్య శబ్ద విన్యాసం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వివరాలకు 99661 02201 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమానికి 10 రాష్ట్రాల నుంచి విశ్వకర్మ సమాజ ప్రతినిధులు, పురస్కార గ్రహీతలు హాజరవుతారని తెలిపారు.

ఘనంగా గంగానమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న గ్రామస్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శ్రీగంగానమ్మ అమ్మవారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆరు గంటల నుంచి గణపతి పూజ, అఖండ దీపారాధన, కలశ స్థాపన, కృష్ణానదీ జలాలతో అభిషేకం, బొడ్డు రాయి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు పవన భక్త బృందం భజన చేశారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను వేలం వేశారు. బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజైన గురువారం ఉదయం 11.30 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారికి పంచామృత అభిషేకం(పళ్లరసాలతో), ఆనవాయితీ వారితో చల్ది నైవేద్యం, గంగానమ్మ అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ సేవా సమితి సభ్యులు తెలిపారు.

8 నుంచి హనుమత్ జయంతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీహనుమత్ దీక్షా పీఠంలో ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు హనుమత్ జయంతి ఉత్సవాలు, దీక్ష విరమణలు జరుగుతాయని పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ పేర్కొన్నారు. 8న విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం, అంకురార్పణ జరుగుతాయన్నారు. 9వ తేదీ ఉదయం దేవతారాధన, సుందరకాండ పారాయణ, మన్యుసూక్త మూలమంత్ర హోమాలు నిర్వహిస్తామని చెప్పారు. 13వ తేదీ ఉదయం ఆరు గంటలకు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు, ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ, 108 కలశాల కృష్ణా జలాలతో అభిషేకాలు జరుగుతాయన్నారు. స్వామి వారి దీక్షను స్వీకరించిన భక్తులకు దీక్ష విరమణలు చేపడతామన్నారు.

ఎస్‌ఐ దుర్గాప్రసాద్ బాధ్యతల స్వీకారం



పెనుగంచిప్రోలు:ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ హరిప్రసాద్ మైలవరం బదిలీ కాగా ఆయన స్థానంలో విజయవాడ నుంచి దుర్గాప్రసాద్ ఇక్కడకు వచ్చారు.

కల్యాణోత్సవ ఏర్పాట్ల పరిశీలన



వేదాద్రి(జగ్గయ్యపేట):గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం గురువారం జరగనుండటంతో ఏర్పాట్లను విజయవాడ డీసీపీ అజిత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్ధరాత్రి 12 గంటలకు స్వామి వారి కళ్యాణం జరుగుతుందని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు రానుండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా కృష్ణానది వద్ద భక్తులు పవిత్ర స్నానాలు చేసే సమయంలో ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ జనార్దన్ నాయుడు, సీఐ జానకిరామ్, ఎస్‌ఐ దుర్గాప్రసాద్, ఈవో నాగరాజు, కెసీపీ ప్రతినిధి రాంప్రసాద్ పాల్గొన్నారు.

కనులపండువగా బ్రహ్మోత్సవాలు



చిట్టేల(వత్సవాయి):శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం నాడు విశ్వక్సేనారాధనం, పుణ్యావాహచనం, అగ్ర్ప్రణయనం, ప్రధాన కుంభారాధనం తదుక్త హవనం పూజలు నిర్వహించారు. పల్లకీ వాహనసేవ ఉత్సవము, ఉత్సవమూర్తులకు విశేషస్నపన కార్యక్రమాలను వేదపండితులు దీవీ బాలాజీ రంగాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్చకులు హరి శివరామప్రసాద్ శాస్త్రి, సిరికొండ వెంకటసాయి కృష్ణమాచార్యులు పూజలు చేశారు. ఆలయ నిర్మాణధర్మకర్త మార్రెళ్ల పుల్లారెడ్డి దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి క్రతువులు జరిపించారు.

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవాలు



ప్రతిష్ఠించబోయే విగ్రహాలకు జలాధివాసం నిర్వహిస్తున్న భక్తులు

నందిగామ(చందర్లపాడు): మండలంలోని చింతలపాడు గ్రామంలో అలివేలు మంగ, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ప్రత్యేకంగా తీసుకువచ్చిన నదీ జలాలతో ప్రతిష్ఠించబోయే విగ్రహాలకు జలాధివాసం నిర్వహించారు. అనంతరం ధాన్యాధివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు యనమదల రాజేష్ శర్మ, శ్రీనివాస్ శర్మల పర్యవేక్షణలో పలువురు వేద పండితులు పలు రకాల హోమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



చౌటపల్లి గడప గడపలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చౌటపల్లి(వీరులపాడు):ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అబివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా అన్ని వర్గాలకు మంచి జరిగేలా పారదర్శక పాలన సాగిస్తున్నారని చెప్పారు. కులమతాలు, రాజకీయాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిరుపేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే సమున్నత ఆశయంతో ఆరోగ్య శ్రీ పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. కానీ ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసి పేదలకు నాణ్యమైన వైద్యం అందని ద్రాక్ష చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత 2500లకు పైగా జబ్బులను ఆరోగ్య శ్రీ పరిధిలో చేర్చి పథకానికి పూర్వ వైభవం తీసుకువచ్చారని తెలిపారు. మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ కోటేరు లక్ష్మీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ పల్లెపోగు పుల్లయ్య, ఉప సర్పంచ్ కోట సంగయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పల్లెపోగు మార్తమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కోట రామారావు, మండల రైతు విభాగం కన్వీనర్ మట్టూరి సాయిబాబు, పలువురు నాయకులు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన సహస్ర చండీయాగం



విశేష పూజలు నిర్వహిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిజీ



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిజీ అనుగ్రహ భాషణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నైనవరం ఫ్లైఓవర్ సమీపంలోని కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో వారం రోజులుగా జరుగుతున్న సహస్ర చండీయాగం బుధవారంతో ముగిసింది. శక్తిపీఠం ఆవరణలోని యాగశాలలో బుధవారం నిర్వహించిన మహా పూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాలలో చివరి రోజైన బుధవారం అమ్మవారిని విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిజీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శించుకున్న అనంతరం స్వాత్మానందేంద్ర సరస్వతి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

80 మంది రుత్వికుల ఆధ్వర్యంలో..

దుర్గగుడి స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో 80 మంది రుత్వికుల చేతుల మీదగా రెండు యాగశాలల్లో మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండప ఉద్వాసనలు, మహా కుంభాభిషేకం నిర్వహించిన అనంతరం వేద ఆశీర్వచనం పలికారు. శక్తిపీఠం ఉత్తరాధికారి కరుమారి దాసు పర్యవేక్షణలో యాగ నిర్వాహకులు, ఉభయదాతలు, దాతలు, భక్తులకు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

అమ్మ వారి సేవలో కాణిపాకం దేవస్థాన ఛైర్మన్

కాణిపాకం దేవస్థాన చైర్మన్ మోహన్‌రెడ్డి బుధవారం కరుమారి అమ్మన్‌ను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మోహన్‌రెడ్డిని ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మ వారిని దర్శించుకున్న అనంతరం మోహన్‌రెడ్డి కాణిపాకం దేవస్థానం స్వామి వారి శేషవస్త్రాలను అందజేశారు. కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో నిర్వహించిన సహస్ర చండీయాగం సందర్భంగా అన్నదానానికి 350 బస్తాల బియ్యం అందజేసిన కుంటముక్కల కుమార్‌తో పాటు పెదపులిపాకలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి దేవస్థాన పీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామి, గజల్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి, హనుమత్ దీక్షాపీఠం కన్వీనర్ రాంపిళ్ల జయప్రకాష్ తదితరులకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని భక్తులకు భారీగా అన్న ప్రసాద వితరణ జరిగింది. ఉత్సవాలను లఖంరాజు సునీత, కోడూరి సుందరి, చలువాది ప్రకాష్, ఉత్సవ కమిటీ సభ్యులు జ్ఞానేశ్వర్, వై.వి.నాగేందర్, ఫణికుమార్, చంద్రకళ, బత్తుల వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.